# విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 09 సెప్టెంబరు 2025   8 పేజీలు


# యూరియా కొరతపై రైతాగ్రహం

## ఉభయ గోదావరి జిల్లాల్లో సీపీఐ, రైతుసంఘం ధర్నాలు

ఏలూరులో

"యూరియా, ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను నియంత్రించి రైతాంగానికి వాటిని సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఉభయ గోదావరి జిల్లాల్లోని మండల కేంద్రాల దగ్గర సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జరిగిన ధర్నాలకు సీపీఐతోపాటు అనుబంధ సంఘాల నేతలు, రైతులు పాల్గొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ నేతలు నినదించారు. తక్షణమే స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని డిమాండ్ చేశారు."

రాజమండ్రిలో

తణుకులో

సామర్లకోటలో

**విశాలాంధ్ర-ఏలూరు/తణుకు/రాజమండ్రి/సామర్లకోట/** నానో ఎరువుల కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కయ్యిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ), ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చారు. రైతులకు ఎరువులను సక్రమంగా అందించాలని, బ్లాక్ మార్కెట్లో ఎరువుల అమ్మకాలను అరికట్టాలని, రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతుల సమస్యలు తీరేంత వరకు పోరాడుతామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దేగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతుల కష్టాలను తీరుస్తామని, రైతులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత రైతులు పడుతున్న కష్టాలను ఇబ్బందులను తొలగించడానికి ఏమాత్రం ప్రయత్నం చేయడంలేదని విమర్శించారు. రాష్ట్రంలోని రైతులు ఎండనక, వాననక ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడి పడిగాపులు పడుతున్నారని అన్నారు. పెద్ద వయసు కలిగిన రైతులు క్యూ లైన్లలో నిలబడలేక చెప్పులు, కర్రలు, గొడుగులు, క్యూ లైన్లో పెట్టి ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం, అధికారులు ఇవేమీ పట్టనట్టు వేల మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నాయని అబద్దాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. బ్లాక్ మార్కెట్లో యూరియా బస్తా వంద రూపాయలు అదనంగా, డీఏపీ బస్తా రెండు వందలు అదనంగా నల్ల వ్యాపారులు విక్రయిస్తుంటే ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. నానో ఎరువుల కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తుందా అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ▶మిగతా 2లో..

## మెడికల్ కళాశాల భవనాలు మంత్రి పరిశీలన

**విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు :** ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏలూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలను సోమవారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు.

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అవసరమైన భవనాలు వైద్య చికిత్స పరికరాలు ఏమి అవసరమో వైద్య శాఖ అధికారాల నుండి మంత్రి పార్థసారథి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సిబ్బంది నియామకాలు భర్తీ చేయటంతో పాటు ప్రభుత్వం ద్వారా లేదా సిఎస్ఆర్ ద్వారా అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను సమకూర్చేలా చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కొన్ని భవనాలను వైద్య కళాశాలకు వినియోగిస్తున్నట్టు తెలిపారు. రెండు మూడు నెలల్లో వైద్య కళాశాల భవనాలు పూర్తయితే అవికూడా యధావిధిగా తిరిగి ఆసుపత్రి వినియోగంలోకి వస్తాయన్నారు. మంత్రి వెంట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు, ఏఎంసి చైర్మన్ మామిళ్లపల్లి పార్ధసారథి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి ఉన్నారు.

## సాగులో ప్రకృతి సేద్య విధానాలను అవలంబించాలి

### కలెక్టర్ మహేష్ కుమార్ రైతులకు పిలుపు

**విశాలాంధ్ర - కాకినాడ :** వరి సాగులో ప్రకృతి సేద్య విధానాలను అవలంబించి రైతుల ఖర్చు తగ్గించడంతో పాటుగా లాభాన్ని పెంచే నానో యూరియా వాడాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిధిలోని అలమూరు గ్రామంలో వరి పంట సాగు క్షేత్రాలలో ఆయన విస్తృతంగా పర్యటించి రైతులతో సాగు విధానాలు, పెట్టుబడి ఖర్చులు, దిగుబడులు, సస్యరక్షణ, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వివిధ రకాల పంటల సాగు పరిమితులు అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటల సాగులో నానో యూరియా వాడడం ద్వారా వాస్తవ ప్రభావం రైతులకు ఉంటుందన్నారు. రైతులకు నానో యూరియా ఒక ప్రత్యామ్నాయంగా నిలుస్తోందనీ, యూరియాకు ప్రత్యామ్నాయం కాకపోయినా, సాంప్రదాయ ఎరువులతో పాటు వాడినప్పుడు రైతులకు 25 శాతం వరకు యూరియా పొదుపు అవకాశం కల్పిస్తుందన్నారు. స్థానిక రైతులు తాడి రామ చంద్రారెడ్డి, సత్య సతీష్ రెడ్డి, దమ్ము సత్య నారాయణలను వెదజల్లే విధానం, నాట్లు వేసే విధానం గూర్చి అడిగి తెలుసుకున్నారు. వారు సాగు విధానాలు తెలుపుతూ మొదటి దశలో 30 కేజీలు, ▶మిగతా 3లో..

## క్షయ, హెచ్‌ఐవి వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

**విశాలాంధ్ర-ముదినేపల్లి :** క్షయ, హెచ్‌ఐవి వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ముదినేపల్లి పి హెచ్ సి వైద్యురాలు శాంతిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని వడాలి పిహెచ్సి ఉప కేంద్రంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ సంయుక్త ఆధ్వర్యంలో

ప్రజలకు హెచ్‌ఐవి, క్షయ వ్యాధుల పట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధులను ఆరంభంలో గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందన్నారు. అప్రమత్తంగా లేకపోతే ప్రాణహాని కలుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 1097 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్లు సిహెచ్ నాగలక్ష్మి, చంద్రావతి, ఏఎన్ఎం జి. చంద్రిక, ఎంఎల్ హెచ్ పి జి. స్నేహ, ఆశా వర్కర్లు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## రిజిస్టర్డ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**విశాలాంధ్ర-ఏలూరు:** ఏలూరు జిల్లా నీటియాజమాన్య సంస్థ ద్వారా 2024-25 నకు గాను వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. వెంకటసుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, ఆడిట్ చేసేందుకు ఛార్టర్డ్ అకౌంటెంట్లను నియమించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. ఆసక్తి గల ఛార్టర్డ్ అకౌంటెంట్లు తమ దరఖాస్తులను, విద్యార్హతలు, అనుభవ పత్రాలతో ప్రాజెక్టు డైరక్టరు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ,ఏలూరు జిల్లా,ఏలూరు వారికి ఈనెల 12వ తేది సాయంత్రం 5 గంటల లోపుగా పంపించాలని ఆయన కోరారు.

## రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

**విశాలాంధ్ర- పాలకోడేరు :** పాలకోడేరు మండలం వేండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పంపన సాయిబాబుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ప్రధానోపాధ్యా యులు జీ.వి.వి.శ్రీనివాస్ అధ్యక్షతన సత్కార సభ

జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు జీవీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక గురువుగా ఎందరో విద్యార్ధులను తీర్చిదిద్ది భారత రాష్ట్రపతిగా అత్యున్నత స్థానానికి చేరుకున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు విద్యాభివృద్ధిలో సమాజానికి ఉత్తమపౌరులను అందించే అనిర్వచనీయమైన పాత్రను పోషిస్తున్న ఉపాధ్యాయులు పంపన సాయిబాబాను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాయిబాబు అందుకున్నారన్నారు. అవార్డుగ్రహీత పంపన సాయిబాబు మాట్లాడుతూ విద్యార్థులక్షేమం, సంక్షేమం, వారి బంగారు భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. అనంతరం అవార్డు గ్రహీత సాయి బాబు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకటరమణ, జె.శ్రీనివాసు, సుభోసుబాబు, రాజ వర్ధిని, వి.పార్వతి, వరలక్ష్మి, సి.హెచ్. రాధ, ఫణిరాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు వారికి నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్ వెల్ఫేర్ నుండి 20 వేలరూపాయల చెక్కును అందజేయగా, దానిని పంపన సాయిబాబు పాఠశాలకు వినియోగించమని ప్రధానోపాధ్యా యులు శ్రీనివాస్‌కు అందజేశారు.

## అందుబాటులో యూరియా

**విశాలాంధ్ర - ఉంగుటూరు :** యూరియా సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేదని, ఉంగుటూరు మండలంలో ఉన్న 8 సొసైటీలలో అన్ని చోట్ల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్ తెలిపారు. 150 ఎం టి ఎస్ యూరియా అందుబాటులో ఉందని రైతులకు ఎటు వంటి ఇబ్బంది లేకుండా సొసైటీస్ ద్వారా అందిస్తున్నామన్నారు. వరి, ఉద్యాన పంటలకు అవసరమైన ఎరువులు అవసరం మేరకే వాడాలన్నారు. మరో వారంలో ఇంకో 150 ఎం టి ఎస్ వస్తుందన్నారు.

## రైతాగ్రహం (1వ పేజీ తరువాయి)

రైతులు ఎరువుల కొరత వలన అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు ఎరువులు సరిపడా ఉన్నాయని చెబుతున్నా రాష్ట్రంలోని రైతులు క్యూ లైన్లలో నిలబడి పడిగాపులు కాస్తున్న విషయం అధికారుల దృష్టికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. క్యూలైన్లలో రైతులను నిలబడవద్దని చెబుతున్న ప్రభుత్వం ఇంటింటికి అందించే కార్యక్రమం ఏమన్నా చేపట్టారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో ఎరువులను వినియోగించాలని చెబుతుంటే రైతులు మాత్రం నానో ఎరువుల వలన పంట దిగుబడి రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం, అధికారులు పరిశీలించాలని తెలిపారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పది రోజులుగా జిల్లా కలెక్టర్ పదే పదే జిల్లాలో ఎరువుల కొరత లేదని చెబుతున్నప్పటికీ జిల్లాలో అనేకచోట్ల రైతులు ఎరువుల కోసం క్యూ లైన్ లలో పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎరువుల కొరత లేనప్పుడు జిల్లా ఇన్చార్జి మంత్రి సోమవారం ప్రత్యేకించి సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. అనంతరం మండల తహసీల్దార్ గాయత్రికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, ఏరియా కార్యవర్గ సభ్యులు మావూరి విజయ, కొల్లూరి సుధారాణి, కొండేటి రాంబాబు, కొండేటి బేబి, ఎంఎ హకీం, ఏరియా కౌన్సిల్ సభ్యులు భజంత్రి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి రమణయ్య, దాసిపల్లి ఆదినారాయణ, గుంజే శ్రీను, దాచేపల్లి ఎర్రయ్య, వెదురుపర్తి శారద, షరీఫ్, ముదపాక ధనలక్ష్మి, ముదపాక సత్యనారాయణ, తోట సురేష్, తదితరులు పాల్గొన్నారు.

**తణుకు:** ఎరువుల కొరత నివారించి రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని, ఎరువులు బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఎరువుల కొరతను నిరసిస్తూ సోమవారం సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ డి.అశోక్‌వర్మకు అందజేశారు. భీమారావు మాట్లాడుతూ ప్రతి ఎకరాకు 200కిలోలు ఎరువులు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని కోరారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతున్న వారిపై విజిలెన్స్, పోలీస్ అధికారులు దాడులు చేసి దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ యూరియా పై బ్లాక్‌లో వంద రూపాయలు, డిఎపి పై రెండు వందలు రూపాయలు అదనంగా వసూలు చేయడాన్ని అరికట్టాలన్నారు. సీపీఐ తణుకు ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ సమితి సభ్యులు పెండ్యాల దత్తాత్రేయ ప్రసాద్, అమ్మిరాజు, బొద్దాని మురళి, కృష్ణ కిషోర్,పెన్మెత్స సత్యనారాయణ రాజు, కొంబత్తుల రవికుమార్, సారిపల్లి శ్రీరామ్, నూనె రాధాకృష్ణ తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు

యూరియా కొరతను అరికట్టాలంటూ సిపిఐ ధర్నా

**నూజివీడులో :** ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో యూరియా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని రైతు లందరికీ యూరియా సరఫరా చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్ వినూత్నకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సమితి నాయకులు చలసాని రామారావు, పటాపంచల జమలయ్య మాట్లాడుతూ యూరియా లేక రైతాంగం ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదని విమర్శించారు. ప్రైవేటు వ్యాపారస్తులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు విక్రయిస్తుంటే అధికారులు మొద్దు నిద్ర పోతున్నారని అన్నారు. పిఏసిఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులందరికీ యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, కార్యవర్గ సభ్యులు మదుపల్లి నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, బొప్పుడి రాంబాబు, ఆకునూరి విఘ్నేష్, అరికోటి రామారావు, ఒగ్గు ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

**చాటపర్రులో :** రాష్ట్రంలో ఖరీఫ్ పంటకు రైతులకు అవసరమైన యూరియా, తదితర ఎరువులను సక్రమంగా అందించాలని కోరుతూ సోమవారం నాడు ఏలూరు రూరల్ మండలం చాటపర్రు

తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు, వ్యవసాయ కార్మికులు నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఏఐకేఎస్, బికెఎంయు ఏలూరు మండల సమితుల ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహశీల్దార్ కు నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బి.కె.యం.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్ పంట ఆలస్యంగా ప్రారంభమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం పట్టా ఉన్న రైతులకు మాత్రమే యూరియా విక్రయిస్తుందని కౌలు రైతులకు యూరియా ఇవ్వటం లేదని తెలిపారు. రాష్ట్రంలో 80 శాతం మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, ఎటువంటి షరతులు లేకుండా రైతులందరికీ అవసరం మేరకు యూరియా తదితర ఎరువులను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు రూరల్ మండల కార్యదర్శి పొట్టేలు పెంటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా తదితర ఎరువులు బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని,బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు.ఇప్పటికైనా రైతులందరికీ యూరియా తదితర ఎరువులను అందించాలని ఆయన కోరారు.నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి. కిషోర్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు బుగ్గల ప్రభాకర్ రావు, మద్దుల వెంకటస్వామి, బోడిగడ్డ ఏసుబాబు, అరిగెల రాజు, గంట వెంకట్రావు, దాసరి రాము, బి.యేసురత్నం, మద్దుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం:** ఎరువుల కొరత నివారించి రైతులకు అవసరమైన ▶మిగతా 3లో..

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు

**విశాలాంధ్ర -నూజివీడు :** సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ బి.వినూత్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను వినతి పత్రాల ద్వారా సబ్ కలెక్టర్‌కు తెలియజేశారు.

నూజివీడు సాధన సమితి నాయకులు నూజివీడును కృష్ణా జిల్లాలో కలపాలంటూ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఎస్సీ కులస్తులకు స్మశానానికి వెళ్ళడానికి దారి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ స్మశాన వాటికకు దారిని కల్పించా లంటూ సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందించారు. సీపీఐ ఆధ్వర్యంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సబ్ కలెక్టర్ వినూత్న తెలిపారు.

## నానో యూరియా వాడండి

**విశాలాంధ్ర- ముసునూరు :** మండల కేంద్రం ముసునూరు ప్రాథమికవ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో సొసైటీ చైర్మన్ దేవినేని శ్రీధర్ బాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఆలూరి చాముం డేశ్వరి సోమవారం రైతులకు యూరియా ఎరువును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు యూరియా ఎరువులు కోసం ఆందోళన చెంద వలసిన అవసరం లేద న్నారు. సహ కార సంఘాలలో,

గ్రోమోర్‌లో సుమారు 42 మెట్రిక్ టన్నుల యూరియా అందు బాటులో ఉందన్నారు. వరి తదితర పంటలు సాగు చేసే రైతులు యూరియాను అధిక మోతాదులో వాడటం వలన పంటలకు చీడపీడలు ఆశిస్తాయని, నాటు వేసిన 30 రోజులకు రెండో విడతగా ఎకరాకు30 కేజీలు, మూడో విడతగా 60 రోజులకు మరో 30 కేజీలు యూరియాను మాత్రమే ఎరువుగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాబాయి, పిఏసిఎస్ సెక్రటరీ దాసిరెడ్డి లక్ష్మణ, రైతులు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజాభివృద్ధి

**విశాలాంధ్ర-భీమడోలు :** వివక్షత లేని సమాజ స్థాపనకు విద్య దోహదపడుతుందని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు శాఖా గ్రంథాలయంలో సోమవారం 58వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశా లకు చెందిన విద్యా ర్థులు విచ్చేశారు. ముందుగా చదువుల తల్లి సరస్వతి దేవికి పూలమాలలు వేసి విద్యా

ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందు తుందని, విద్యార్థులంతా బాగా చదువుకుని తన సమాజ అభివృద్ధిలో భాగస్వా ములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కోలాట నృత్యాలు

**విశాలాంధ్ర-లింగపాలెం:** మఠంగూడెంలో జాస్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు కోలాట నృత్యాలు ప్రదర్శించారు. ఇవి ఎంతగానో ఆకట్టు కున్నాయి. ఈ కార్యక్ర మంలో జాస్తి ఫౌండేషన్

అధ్యక్షులు జాస్తి లక్ష్మీనారాయణ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.

## రైతాగ్రహం (2వ పేజీ తరువాయి)

ఎరువులు సరఫరా చేయాలని, ఎరువులు బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు డిమాండ్ చేశారు. సీపీఐ జంగారెడ్డిగూడెం మండల సమితి ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ స్లీవజోషికి అందజేశారు. ధర్నా నుద్దేశించి రమణరాజు మాట్లాడుతూ ప్రతీ ఎకరాకు 200కిలోలు ఎరువులు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని కోరారు. ఎరువులు బ్లాక్ మార్కెట్ కు పాల్పడుతున్న వారిపై విజిలెన్స్, పోలీస్ అధికారులు దాడులు చేసి దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఏ షాప్ కు ఎన్ని క్వింటాళ్ళు యూరియా సరఫరా చేసింది శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. సీపీఐ జంగారెడ్డిగూడెం మండల సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ, కుంచె వసంతరావు, చంద్ర త్రిమూర్తులు, చిలంతలరాజుల శ్రీను, పెనుమాకుల దుర్గయ్య, జగన్నాథ హనుమంతు, కాసగాని దుర్గా ప్రసాద్, అలం బంగారయ్య తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు.

**ద్వారకాతిరుమల:** యూరియాను బ్లాక్ మార్కెట్‌గా చేసి ఎక్కువ సొమ్ముకు విక్రయిస్తున్న వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి గోలిమే బాలయేసు అన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ద్వారకా తిరుమల తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జేవీ సుబ్బారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గోలిమే బాల యేసు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్ చేసి ఎక్కువ సొమ్ముకు విక్రయిస్తున్న వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యడ్లపల్లి రమేష్, కొవ్వుల రామకృష్ణ, ఏపూరి గంగరాజు, ఏపూరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**చింతలపూడి :** యూరియా కొరతను నివారించాలని సీపీఐ సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీగా తహసీల్దారు కార్యాలయం వరకు వచ్చి అక్కడ ధర్నా

నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దారుకు వినతి పత్రం అందచేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు మాట్లాడుతూ వరి పామాయిల్ కొబ్బరి తదితర పంటలకు ప్రస్తుత దశలో రసాయనిక ఎరువులు ముఖ్యంగా యూరియా అందుబాటులో లేకుండా పోయిందన్నారు. యూరియా కొరతను నివారించి ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు షాపుల్లో కూడా యూరియా సప్లై చేయవలసిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శి తోర్లపాటి బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లూరి సోమశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కంచర్ల గురవయ్య, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు టీవీఎస్ రాజు, తొర్లపాటి రాజు, మండల కమిటీ సభ్యులు జంగా రామచంద్రారెడ్డి, ఎస్ కే కాలేషా, సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు ఎస్ కే మస్తాన్, ముల్లగిరి నాగేశ్వరరావు, తాడిగడప మాణిక్యాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ముళ్లగిరి లాజరు, రైతు సంఘం నాయకులు తక్కెలపాటి ప్రసాద్ రావు, మొర్తా అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

**కుక్కునూరు :** కుక్కునూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుక్కునూరు మండల రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు .రెండు

రోజుల క్రితం కుక్కునూరు గ్రోమోర్ దుకాణానికి యూరియా కోసం రైతులు వెళ్తే ..ఎఫ్20 ఎరువులను కొంటేనే యూరియా ఇస్తామని మండల వ్యవసాయాధికారి, గ్రోమోర్ నిర్వాహకులు తెగేసి చెప్పారని పేర్కొన్నారు. మండల రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు మైసాక్షి వెంకటాచారి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, సీపీఐ కుక్కునూరు కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబూరావు, పూరెం వెంకటే, ఉంగా భీమా, శుక్లా పాల్గొన్నారు.

**భీమవరం:** జిల్లాలో యూరియా కొరతను నివారించడానికి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, కోఆపరేటివ్ సొసైటీలు, రైతు సేవా కేంద్రాల రైతాంగానికి సరిపడా యూరియా, డిఏపి ఇతర ఎరువులను సరఫరా చెయ్యాలని



సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఏఐటియుసి నాయకులు కిలారి మల్లేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి మల్లుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. భీమవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ రావి రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరతలేదని అధికారులు చెపుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, యూరియాను అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగిడి శాంతమూర్తి, చాన్ భాష, వీరవల్లి బాబ్జీ, ఫార్వార్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి :** ఎరువులు అందక సన్న, చిన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా నాయకులు కొవ్వుల నాగరాజు, మండల కార్యదర్శి కారం దారయ్య అన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా ఇతర ఎరువులు నిజమైన రైతులకు అందడం లేదన్నారు. కల్తీ ఎరువులు కట్టబెడుతున్నారని అన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై ఇచ్చి రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని అన్నారు. అనంతరం కార్యాలయంలో వీఆర్వోలు తిరుపతమ్మ, తులసిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఓర్సు శ్రీను, మిరియాల నారాయణ, మిర్యాల లక్ష్మణరావు, మిర్యాల కామయ్య, ముడియం వెంకటేశ్వర్లు, పూనం ముత్యమ్మ, వేముల శ్రీను, పురేటి పెద్ద కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

**వేలేరుపాడు :** రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎరువులు

అందించడంలో విఫలమైందన్నారు. మండలంలో ఎక్కువగా జిరాయితీ భూములు, పోడు, బంజరు భూములు అధికంగా ఉన్నాయని వాటికి ఎరువులు అందే పరిస్థితి లేదన్నారు. పట్టా ఉన్నవారికి కాకుండా కౌలు రైతులకు కూడా ఎరువులు అందించాలన్నారు.

పలు డిమాండ్లను తెలియజేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఎండి మునీర్, సీపీఐ మండల కార్యదర్శి బాడిశ రాము, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, స్థానిక నాయకులు యర్రా మధు, కురిమెళ్ళ వెంకటేశ్వరరావు, మడకం దుర్గారావు, సోడే సత్తిబాబు, ఎస్కే గౌస్, మడకం రాజులు, కొర్రి సత్యం, నిమ్మల రాంబాబు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కర్నాటి అనిల్, మెండెం నారాయణ, చిచ్చుడి దేవయ్య, కాకా లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

**విశాలాంధ్ర-ఏలూరు:** సంచార జాతుల వారి పిల్లలను విద్యకు దూరం చేయవద్దని కలెక్టర్ కె. వెట్రిసెల్వి వారి తల్లిదండ్రులకు హితవు పలికారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో పాటు

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ యం.ముక్కంటి, ఏలూరు ఆర్డిఓ యం. అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి, అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి 324 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా సంచారజాతులకు చెందిన పలు కుటుంబాల పిల్లలకు ఆధార్ కల్పించాలని వారిని దత్తత తీసుకున్న వంగాయిగూడెం మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్దనపు శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ వారిని కలిసి సంచార జాతుల పిల్లలకు ఆధార్ కార్డులు జారీ చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పందిస్తూ ఆ కుటుంబాల వారి సమస్యలను తెలుసుకుని వారికి అవసరమైన ఆధార్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి పిల్లలను పాఠశాలకు పంపాలని సూచించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగా పోటీల్లో సత్తా చాటిన గురుకుల బాలికలు

**విశాలాంధ్ర -ముసునూరు:** ఏలూరు జిల్లా యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆగిరిపల్లి శ్రీ వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్ర ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ముసునూరు గురుకుల పాఠశాల విద్యార్థినిలు విజేతలుగా నిలిచి తమ సత్తా చాటారు. పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ కుమారి, ట్రిల్ టీచర్ జి. నాగమల్లేశ్వరి, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ పత్రికా ముఖంగా తెలిపిన వివరాల ప్రకారం ఆగిరిపల్లి శోభనాపురం, వట్లమూరు, నూజివీడు, ముసునూరు ప్రాంతాల పలు పాఠశాలలకు చెందిన సుమారు 56 మంది

సీనియర్, జూనియర్స్, సబ్ జూనియర్స్, విభాగాల్లో పోటీ పడగా ఈ యోగా పోటీలకు టీవీ రవికుమార్ కాశీ ప్రసాదులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారన్నారు . ఈ పోటీ పడిన వారిలో 8 మంది గోల్డ్ మెడల్స్, నలుగురు సిల్వర్ మెడల్స్, ముగ్గురు కన్సోలేషన్ బహుమతులు పొందారని, ముసునూరు గురుకుల పాఠశాల విద్యార్థినిలలో జూనియర్ విభాగంలో మొదటి బహుమతి జె. హారిక తొమ్మిదవ తరగతి విద్యార్థిని పొందగా , రెండవ బహుమతి ఎల్. అను, మూడవ బహుమతి కె. ఐశ్వర్య ఏడవ తరగతి వారు దక్కించుకున్నారన్నారు రు. సబ్ జూనియర్ విభాగంలో రెండవ బహుమతి ఏడవ తరగతి చదువుతున్న కె. సౌజన్య దక్కించుకోగా మూడవ బహుమతి కె.ఐశ్వర్య దక్కించుకుందని తెలిపారు. ఈ బహుమతులను జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు యందూరి నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి బొద్దురి సాంబశివరావు, ముఖ్య అతిథులు బహుమతి ప్రదానం గావించినట్లు తెలిపారు.

## ఎరువుల యాజమాన్యం పై అవగాహన

**విశాలాంధ్ర- పాలకోడేరు :** వరి సాగులో ఎరువుల యాజమాన్యం ఎంతో కీలకమని పాలకోడేరు మండల వ్యవసాయ అధికారిణి బి. సంధ్య అన్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో సోమవారం రైతులకు వరి సాగులో ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా రైతులు భూమికి ఎరువులను అందించవలసి ఉంటుందని, దానివల్ల రైతులు అనవసరమైన ఖర్చులు తగ్గించుకోవచ్చు అన్నారు. అధిక మోతాదులో ఎరువులు పురుగు మందుల వాడకం వలన భూమి సారాన్ని కోల్పోవడమే కాకుండా పర్యావరణ సమతుల్య త దెబ్బతింటుందని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో రైతులు అడిగిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ ఎం. గణపతి రవీంద్రనాథ్, రైతులు పాల్గొన్నారు.

## అవలంబించాలి (1వ పేజీ తరువాయి)

రెండవ దశలో 30 కేజీలు మూడవ దశలో 15 కేజీలు యూరియాను వినియోగించినట్టు తెలిపారు. ప్రస్తుతం పంట పొలాలు చిరుపొట్టదశలో ఉన్నాయని, ఈ సీజన్లో ఇక ఎరువుల అవసరం లేదని తెలిపారు. రబీ సీజన్లో ఎరువులు మోతాదు ఎక్కువగా వాడటం వల్ల గడ్డిని పశువులకు మేతగా వేయడానికి రైతులు ఇష్టపడరన్నారు. డ్రోన్ల సహాయంతో నానో యూరియా డిఏపి వాడటం బాగానే ఉందని కానీ రైతులలో డ్రోన్ల వాడకంపై ఒక అపోహ ఉందని డ్రోన్లు ఎంత ఎత్తులో నుండి పిచికారి చేయాలి ఎన్ని లీటర్ల నీటిలో కలిపి మందులు పిచికారి చేయాలన్న సందేహాలు ఉన్నాయన్నారు. డ్రోన్ వినియోగం వల్ల లేబర్ చార్జీలు తగ్గడంతోపాటు రెండో దఫాలో నానో యూరియా వాడడం వల్ల సాధారణంగా వాడే యూరియా వాడకం 30 కేజీలు మిగులుతుందన్నారు. మానవుని జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రకృతి సేంద్రియ విధానాలు అమితంగా దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, తహసీల్దారు ప్రకాశరావు, జిల్లా వ్యవసాయ అధికారి వి. బోసుబాబు, మండల వ్యవసాయ అధికారి టి. మీనా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ గెలుపు ఖాయం

### ఎన్డీఏకు 422 సభ్యుల బలం ఉందన్న ఎంపీ మహేష్

**విశాలాంధ్ర -ఏలూరు :** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధిస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా ఎంపీలు పాటించాల్సిన నియమ నిబంధనలపై సోమవారం టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణ దేవరాయలు నివాసంలో పార్టీ ఎంపీలకు శిక్షణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ పాల్గొన్నారు. అనంతరం మీడియాకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటు ఉభయ సభల్లో ప్రస్తుతం ఉన్న సభ్యులు 781మంది కాగా, విజయం సాధించడానికి 391 అనుకూలంగా ఓటేస్తే చాలునని, కానీ ఎన్డీయేకు లోక్‌సభలో 293 మంది, రాజ్యసభలో 129 మంది మొత్తంగా 422 మంది సభ్యుల బలం ఉందన్నారు. అంటే విజయానికి అవసరమైన దానికంటే 31 మంది సభ్యులు ఎక్కువే ఉన్నారని, ఎన్డీయేతర పార్టీల నుంచి కూడా అనేక మంది మద్దతు ఇస్తున్న పరిస్థితుల్లో ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సునాయాసంగా విజయం సాధిస్తారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

**పొగాకు అదనపు కొనుగోళ్లకు అనుమతిపై హర్షం :** స్వల్ప పెనాల్టీతో అదనపు పొగాకు కొనుగోళ్లకు అనుమతిస్తూ కేంద్రం గెజిట్ ఉత్తర్వు జారీ చేయడంపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పొగాకు రైతుల సమస్యలపై ఇటీవల ప్రధాని సహ కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేసిన విషయాన్ని ప్రస్తావించిన ఎంపీ తమ శ్రమ ఫలించినందుకు సంతోషంగా ఉందన్నారు.

## విద్య, ఆర్థిక రంగాలలో అభివృద్ధి చెందాలి

**విశాలాంధ్ర-వీరవాసరం:** విద్య, ఆర్థిక రంగాలలో అందరూ అభివృద్ధి చెందాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు

అన్నారు. మండలం లోని పెర్కిపాలెంలో బేడ బుడగ జంగాల సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని సామాజిక వర్గాలన్నీ విద్య, ఆర్థిక రంగాలలో అభివృద్ధి సాధించాలనే దృఢ సంకల్పంతో కృషి చేసే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో, ఆయన ఇచ్చిన బాధ్యతతో అభివృద్ధి చెందాలన్నారు.

## హెూమియో ఆసుపత్రికి స్థలం కేటాయించాలి

**విశాలాంధ్ర-టి నరసాపురం:** మండల కేంద్రం టి నరసాపురంలో హెూమియో ఆసుపత్రికి స్థలం కేటాయించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త యస్ డి నాసర్ పాషా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ టి

సాయిబాబా, ఎంపీడీవో నగరాజ కుమారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం టి నరసాపురంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో హెూమియో ఆసుపత్రి కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల రోగులు హెూమియో చికిత్స ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుండి ఉపశమనం పొందుతున్నారని, ప్రస్తుతం ఆసుపత్రికి శాశ్వత భవనం లేక వెలుగు కార్యాలయంలో కొనసాగుతోందన్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడం వలన లైట్లు, ఫ్యాన్లు లేక వర్షాకాలం, వేసవికాలంలో రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భవనం లేకపోవడం వలన రోగులకు సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రం టి నరసాపురంలో హెూమియో ఆసుపత్రికి స్థలం కేటాయించి పక్కా భవనం నిర్మించి రోగులకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు.

## బీసీ వసతిగృహాల సమస్యలు పరిష్కరించండి

### ఏఐఎస్ఎఫ్ డిమాండ్

**విశాలాంధ్ర-ఏలూరు :** జిల్లాలో ఉన్న బీసీ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని, కొయ్యలగూడెం పట్టణంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని పట్టణంలోనే కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్, కోశాధికారి ఎం.క్రాంతి కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సిద్దు డిమాండ్ చేశారు. బీసీ వసతి గృహాలు, విద్యార్థుల పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్, బీసీ సంక్షేమ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ బాలుర వసతి గృహాలను ఏజెన్సీ ముఖ ద్వారమైన కొయ్యలగూడెం పట్టణం నుండి తరలించకుండా మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ప్రధాన రహదారి వద్ద గత రెండు రోజుల నుండి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేసినా అధికారులు స్పందించలేదని విమర్శించారు. బీసీ వసతి గృహాలలో విద్యార్థులు ఉండటం లేదని కొయ్యలగూడెం మండలం నుండి బీసీ వసతి గృహాలను బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి గ్రామాలకు తరలించడం కేవలం అధికారులు, రాజకీయ నాయకుల స్వార్థమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని వసతి గృహాల తరలింపు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల తరపున భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం శానిటరీ సిబ్బంది విధులు బహిష్కరించి ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ ఏరియా హాస్పటల్ శానిటరీ వర్కర్లకు గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నా న్నారని అన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న శానిటరీ కార్మికులకు కాంట్రాక్టర్ సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదని,ప్రతీసారీ వేతనాలు ఇవ్వడంలో కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నారని కార్మికులు ఆవేదన వెలిబుచ్చుతున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటైనా కాంట్రాక్ట్ ఏజెన్సీని తొలగించి ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించి నేరుగా ప్రభుత్వమే వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి గౌరవాధ్యక్షులు జంపన వెంకటరమణ రాజు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ,మేరీ, ప్రభావతి చంద్రకళ శ్రీను దుర్గారావు కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ గరికపాటి వర్ధంతి

**విశాలాంధ్ర -భీమవరం:** కళ కళ కోసం కాదని, కళ ప్రజల కోసమని నమ్మి తన నాటకాలు, నాటికలు, బుర్రకథలతో ప్రజల్లో చైతన్యం రగిలించిన గరికపాటి ధన్యజీవని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. గరికపాటి రాజారావు 50వ వర్ధంతి సభను భీమవరం సీపీఐ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో డాక్టర్ రాజారావు పగలనక రేయనక ప్రజలను చైతన్య పరచడానికి కమ్యూనిస్టు పార్టీ సభల్లో కళారూపాలు ప్రదర్శిస్తూ ఆయన ఒక సామాజిక కార్యకర్తగా మెలిగారని అన్నారు. వృత్తి డాక్టర్ అయినప్పటికీ ప్రజా వైద్యుడిగా ఆయన పేరు పొందారని తెలిపారు. ఒక రూపాయి కూడా తీసుకోకుండా ప్రజలకు వైద్యం చేయడమే కాకుండా సుదూర ప్రాంతానికి వచ్చిన ప్రజలకు మందులు

ఉచితంగా ఇస్తూ డబ్బులు లేని వారికి తిరుగు ప్రయాణానికి చార్జి కూడా ఇచ్చి పంపించేవారని అన్నారు.

ఆయన మన మధ్య లేకపోయినా ఆయన ఏ ఆశయం కోసం పోరాడారో ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లటానికి మనం అందరం కంకణబద్ధులం కావాలన్నారు. ముందుగా రాజారావు చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జవ్వాది దాశరథి శ్రీనివాస్, నాగిడి శాంతమూర్తి, చాంద్ బాషా, మల్లుల శ్రీనివాసరావు, తిరుమాని కామేశ్వరరావు, కాటి వెంకటరత్నం, ప్రజా కళాకారులు పాల్గొన్నారు.

## నిమ్మకాయల శ్రీనివాసరావు ఆకస్మిక మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

**విశాలాంధ్ర-ఏలూరు:** ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల శ్రీనివాసరావు ఆకస్మిక మృతి ప్రజా ఉద్యమాలకు, సీపీఐకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి డేగా ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిమ్మకాయల శ్రీనివాసరావు బ్రెయిన్ స్ట్రోక్ తో ఆకస్మిక మృతి చెందటం విచారకరం అన్నారు. మున్సిపల్ వర్కర్స్ సమస్యల పరిష్కారంలో గత 35 సంవత్సరాల నుండి అలుపెరుగని పోరాటం చేసి పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఇటీవల జరిగిన జిల్లా మహాసభలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి, జిల్లా మహా సభల విజయవంతానికి ప్రధాన పాత్ర తెలిపారు. జిల్లాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి, సీపీఐ బలోపేతా నికి క్రియాశీలక పాత్ర పోషిస్తున్న శ్రీనివాసరావు మరణం ప్రజా సంఘాల అభివృద్ధికి, సిపిఐకి తీరని లోటన్నారు. శ్రీనివాసరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ,ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## శ్మశాన వాటికకు దారి కల్పించండి

**విశాలాంధ్ర- నూజివీడు :** పోతిరెడ్డిపల్లి గ్రామ దళితుల స్మశాన భూమికి రహదారి సౌకర్యం కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నూజివీడు సబ్ కలెక్టరుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు మడుపల్లి వెంకట నాగేంద్ర రావు మాట్లాడుతూ గ్రామంలో దళితుల శ్మశాన భూమి 2.75 ఎకరాలు ఉందని కానీ స్మశానానికి దారి లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ దళితుల సౌకర్యార్థం భూమి ఇవ్వటానికి ముందుకు వచ్చిన రైతులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం విచారకరమన్నారు. 2018 సంవత్సరంలో ఆనాటి ఆర్డీవో జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు రాసినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విజయకుమార్, నాగభూషణం, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో ఉన్నత శిఖరాలు

**విశాలాంధ్ర-కొయ్యలగూడెం :** విద్యతోనే మనిషి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మండల ప్రజా పరిషత్ అధికారి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా కొయ్యలగూడెం మండల సమాఖ్య ఏపిఎం రూప్సీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుండి ప్రధాన రహదారి వరకు డ్వాక్రా మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న

ఎంపీడీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, మనిషి జీవితానికి చదువు చాలా ముఖ్యమైనదని సూచించారు. ఎంఈఓ సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం సకల సౌకర్యాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, వివో ఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేదు

**విశాలాంధ్ర - గణపవరం:** గణపవరం మండలం కొత్తపల్లి గ్రామంలో యూరియా లభ్యత, నానో యూరియా పై రైతులకు సోమవారం అవగాహన కల్పించామని గణపవరం మండల వ్యవసాయ అధికారి రాయుడు స్వతంత్ర ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం ప్రైవేట్ షాపులు, కోపరేటివ్ సొసైటీలు,కొన్ని ఆర్ఎస్ కే

లలో 118.5 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ముందస్తుగా కొనుక్కోవలసిన అవసరం లేదని సూచించారు. రాబోయే రెండు మూడు రోజుల్లో సొసైటీలలో ఎక్కువ యూరియా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఎక్కడైనా ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని , ఎరువుల పట్ల ఏమైనా సమస్యలు ఉంటే మండల వ్యవసాయ అధికారి వారికి తెలియచేయాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారికి ఫోన్ నెంబర్ 8331056685 .ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రూప్సీ, రైతులు పాల్గొన్నారు.

## అంబులెన్సులు ప్రారంభం

**విశాలాంధ్ర - రాజమండ్రి :** ప్రజలకు మరింత మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు కొత్త అంబులెన్సులు కేటాయించడం జరిగిందని, అందులో భాగంగా తొలి విడతగా మూడు అంబులెన్స్‌లు రావడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో మూడు అంబులెన్స్‌లకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కే వెంకటేశ్వరరావు వివరాలు తెలియ చేస్తూ, ప్రస్తుతం జిల్లాలో 21 అంబులెన్సులు పనిచేస్తున్నా యన్నారు. వీటిలో పాత 11 అంబులెన్సు వాహనాల స్థానంలో, ఆధునిక వైద్య సౌకర్యాలతో కూడిన 5 అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ALS) అంబులెన్సులు, 6 బేసిక్ లైఫ్ సపోర్ట్ (BLS) వాహనాలను ప్రభుత్వం జిల్లాకి మంజూరు చేసిందన్నారు. మొదటి విడతగా జిల్లాకి వచ్చిన 3 కొత్త ALS (Advanced Life Support) అంబులెన్సులను మూడు నియోజక వర్గాలకు పంపుతున్నట్లు తెలిపారు. ఈ అంబులెన్సులలో ఆక్సిజన్ సిలిండర్లు, ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్లు, AED పరికరాలు, అత్యవసర ఇంజక్షన్లు, మందులు వంటి ఆధునిక పరికరాలు అందుబాటులో ఉండటంతో రోగులను ఆసుపత్రికి తరలించే సమయంలోనే ప్రాణ రక్షణ వైద్య సేవలు అందించడం సాధ్యం అవుతుందని తెలిపారు. రానున్న 15 రోజుల్లో మిగిలిన 8 అంబులెన్సులు జిల్లాకు చేరనున్నాయని డీఎంహెచ్వో తెలిపారు. ఈ కొత్త అంబులెన్సుల ద్వారా పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా సకాలంలో వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవా కోఆర్డినేటర్ డా. పి. ప్రియాంక, డీసీహెచ్ఓ ఎస్. ఎం. పద్మ పాల్గొన్నారు.

## 10న ఉపకరణాల నిర్ధారణ క్యాంపు

**విశాలాంధ్ర-దేవరపల్లి:** 10న దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హై స్కూల్లో గోపాలపురం నియోజకవర్గం పరిధిలో జరిగే ఉపకరణాల నిర్ధారణ క్యాంపు నిర్వహిస్తున్నట్లు దేవరపల్లి ఎంపీడీవో వై రాజారావు తెలిపారు. దేవరపల్లి మండలంలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో అల్ ఇంకో సంస్థ ఆధ్వర్యంలో 1 నుండి 18 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఉపకరణ నిర్ధారణ క్యాంపు ద్వారా వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, రో లెటర్లు, మూడు చక్రాల కుర్చీలు, సిపి చైర్లు, ఎం ఆర్ కిట్లు సంక కర్రలు ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ క్యాంపుకు ఆధార్ కార్డులు రేషన్ కార్డు రెండు ఫోటోలు సదరం సర్టిఫికెట్ యు డి ఐ డి కార్డు ఫోన్ నెంబర్ అర్హులైన వారు తీసుకొని రావాలని కోరారు క్యాంపు వచ్చే వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేయటం జరుగుతుందని ఎంపీడీవో రాజా రావు తెలిపారు

## సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

**విశాలాంధ్ర - తూర్పుగోదావరి :** ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ వై. మేఘ స్వరూప్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ భవనంలో డిఆర్ఓ టి. సీతారామమూర్తి, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. మేఘ స్వరూప్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని,అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మేఘ స్వరూప్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి .సీతా రామమూర్తి, డి ఎల్ డి వో పి. వీణాదేవి, జాయింట్ డైరెక్టర్ ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్.అప్పలకొండ, ఈస్ట్ జోన్ డీఎస్పీ బి. విద్య పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలి : కలెక్టర్

**విశాలాంధ్ర - తూర్పుగోదావరి :** జిల్లాలో కంద పంటకు సరైన మార్కెట్ ధర లభించడం లేదనే రైతుల ఆందోళనల దృష్ట్యా, ఉత్పత్తి - సరఫరా - మార్కెటింగ్ వ్యవస్థలో సమతుల్యతను తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు అవసరమని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. సోమవారం ఉదయం బొమ్మూరులో కలెక్టర్ ఛాంబర్‌లో ఉద్యానవన, మార్కెటింగ్ అధికారులు, శాస్త్రవేత్తలు, మైక్రో ఇరిగేషన్ నిపుణులు, రైతులు, వ్యాపార వర్గాల ప్రతినిధులతో కలెక్టర్ పి. ప్రశాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిల్వ ఉండని కూరగాయలు విషయంలో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటలను రైతులు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఒకే పంటను వరుసగా పండించడం వలన ధరలు పడిపోవడం, మార్కెట్ ఒడిదుడుకులు రావడం వంటి సమస్యలు వస్తాయని, అందువల్ల పంటల విభిన్నతపై దృష్టి పెట్టాల్సిన అవసరమని పేర్కొన్నారు. రైతుల ఉత్పత్తులను (FPOs) పరిధిలోకి తీసుకురావడం ద్వారా గ్రేడింగ్, ప్యాకేజింగ్, డిమాండ్ ఉన్న మార్కెట్లకు సరుకుల పంపిణీ సులభతరం అవుతుందని చెప్పారు..ఎఫ్‌పీవోల ద్వారా లాజిస్టిక్స్, మార్కెట్ కనెక్టివిటీ బలోపేతం చేస్తే రైతులకు నిజమైన లాభం వస్తుందని అన్నారు. నిల్వ ఉండని కూరగాయల మార్కెటింగ్‌లో గ్రేడింగ్ సిస్టమ్ ప్రవేశపెట్టి, వాటికి తగిన ధర రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానికంగా కూరగాయల ఉత్పత్తికి సరైన ధర, రైతులకు లాభదాయక మార్కెటింగ్, ప్రత్యామ్నాయ పంటలు, గ్రేడింగ్ సిస్టమ్, ఎఫ్‌పీవో బలోపేతం వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో జిల్లా హార్టికల్చర్ అధికారి కె. మల్లిఖార్జున రావు, ఏపీ ఎం ఐ పి పి డి ఏ. దుర్గేష్, కొవ్వూరు వ్యవసాయ / అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా. కె. మమత, ఎడి మార్కెటింగ్ ఏం. సునీల్ వినయ్ కుమార్, రైతులు పి. కృష్ణ మూర్తి, దుళ్ళకు చెందిన కంద రెడ్డి, వ్యాపారవేత్త గణపతి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను ప్రోత్సహించాలి : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ :** దివ్యాంగులను ప్రోత్సహిస్తే వారు అందరిలా రాణిస్తారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక బైపాస్ రోడ్లోని దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల లో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సిటీ నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల విషయంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. గతంలో భవిత సెంటర్స్‌కి ఆ విద్యార్థులు రావడానికి ఎస్కార్ట్ అలవెన్స్, ట్రావెలింగ్ అలవెన్స్ లు మూడు వేలు ఇచ్చే వారని, కూటమి ప్రభుత్వం ప్రస్తుతం దానిని ఆరు వేలు చేసిందన్నారు. భవిత సెంటర్లో పనిచేసే ఆయాలకు ఆరువేల నుంచి ఏడువేలు, ఫిజియోథెరపీ వైద్యులకు పన్నెండు వేల రూపాయలు భత్యాన్ని

పెంచిందన్నారు. సిటీ నియోజకవర్గ పరిధిలో 180 మంది దివ్యాంగులు ఉన్నారని, భవిత సెంటర్లో ఇద్దరు ఐఆర్పీలు ఉన్నచోట, మరో ఇద్దరు ఐఆర్పిలను డిప్యూటేషన్ మీద వేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ నిర్ధారణ శిబిరంలో ఆలింకో కంపెనీ వారు ఏ విద్యార్థికి ఏ ఉపకరణము అవసరమో సర్టిఫై చేస్తారని, తదనగుణంగా ప్రభుత్వం ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేస్తుందన్నారు. పెన్షన్స్ రాని వారి విషయమై అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలు పరిష్కరించాలి :ఆర్డీవో

**విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, అర్జీదారునికి పూర్తి స్థాయి న్యాయం జరిగేలా చూడాలని ఆర్డీఓ ఆర్. కృష్ణ నాయక్ డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన 'పి జి ఆర్ ఎస్ - మీ కోసం' వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన అధికారులు కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ - ఈ రోజు 'మీ కోసం' వేదిక ద్వారా మొత్తం 9 అర్జీలు వచ్చాయని తెలిపారు. ప్రతి అర్జీని నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించి దరఖాస్తుదారునికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర-తాళ్లపూడి :** విద్య, వైద్యానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. దీనిలో భాగంగా టీడీపీ నాయకులు ద్విసభ్య కమిటీ సభ్యులు, మలకపల్లి సొసైటీ అధ్యక్షులు జొన్నల గడ్డసుబ్బరాయ చౌదరి సహకారంతో సొసైటీ ద్వారా సిఎస్ఆర్ ఫండ్‌తో మలకపల్లి, పెద్దివం స్కూల్స్‌కి కంప్యూటర్, స్పోర్ట్స్ కిట్‌లు, డ్రెస్‌లు అందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మలకపల్లి సహకార సంఘం పరిధిలోని మలకపల్లి హై స్కూల్ వంట ఏజన్సీ మహిళకు రూ.40లు విలువైన వంట పాత్రలు, విద్యార్థులకు 25 వేల విలువైన స్పోర్ట్స్ కిట్, దుస్తులు అందచేశారు. సొసైటీ పరిధిలో పెద్దివం హైస్కూల్‌కు రూ.75 వేల విలువైన డిజిటల్ కంప్యూటర్ సిస్టంను అందచేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బలక్ష్మి, నాగేంద్ర, సర్పంచ్ రాజేశ్వరి, ఎన్డీయే నాయకులు పాల్గొన్నారు.

## వైద్య సదుపాయలు సద్వినియోగం చేసుకోండి

**విశాలాంధ్ర - కడియం :** ప్రభుత్వ వైద్య సదుపాయాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, ఎంపీపీ అధ్యక్షతన మండల సిహెచ్సి పిహెచ్సి అధికారులు, హెల్త్ డిపార్ట్మెంట్ ఎఎన్ఎం లు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రైమరీ హెల్త్ సెంటం, కడియం ప్రభుత్వ ఆసుపత్రు లలో అనేక రకాల వైద్య సేవలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. పేషెంట్‌లకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, జనసేన మండల అధ్యక్షులు ముద్రగడ జమ్మి, ఎంపీడీవో రమేష్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చిరుకూరి ప్రభ, పిహెచ్‌సీ డాక్టర్లు జ్యోత్స్న, జెస్సీ, మౌర్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పంచాయతీ కావాలి

**విశాలాంధ్ర - సీతానగరం:** రామచంద్రపురం గ్రామానికి ప్రత్యేక పంచాయతీ కావాలి అంటూ పి జి ఆర్ ఎస్‌లో అర్జీ సమర్పించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏ ఓ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 6 అర్జీలు వచ్చాయి. అలాగే భూ సంబంధిత వివాదాల పై 5 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు బదిలీ చేయడం జరుగుతుంది అని సాధ్యమైన అంత త్వరగా అర్జీలను పరిష్కారం చేయడం జరుగుతుందమండల, గ్రామ అధికారులు, అర్జీదారులుపాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**విశాలాంధ్ర - రాజమండ్రి:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే సమాజం... వారి కుటుంబం అభివృద్ధి చెందుతాయని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పేర్కొన్నారు. సెయింట్ పాల్స్ గ్రేస్ లూథరన్ తరఫున నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్, ఎంబ్రాయిడింగ్, మగ్గం వర్క్, బ్యూటీషన్ కోర్స్ తదితర వాటిలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, యువతులకు ప్రశంసా పత్రాలను సదరు చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై వారికి ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం సంఘం సభ్యులు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పాల్స్ గ్రేస్ లూథరన్ కాపరి పైడిమల సుందర్ రాజు, అసిస్టెంట్ పాస్టర్లు ప్రెసిడెంట్ ములగాడ ఏలియా, ప్రెసిడెంట్ కోరుమిల్లి విజయ శేఖర్, సెక్రెటరీ లాజర్, ట్రెజరర్, అలాగే స్థానిక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

**విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో అదనపు కమిషనర్ నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 14 ఫిర్యాదులు వచ్చాయి.. పీజీఆర్ఎస్ లో వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు అదనపు కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, రెవిన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## 242 మెట్రిక్ టన్నులయురియా

**విశాలాంధ్ర - సీతానగరం:** మండలంలో వివిధ సొసైటీ లలో 242.5 మెట్రిక్ టన్నులు యురియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారిని గౌరీ దేవి అన్నారు. గౌరీ దేవి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకూ 1881 మెట్రిక్ టన్నులు యురియా సరఫరా చేశారన్నారు. గత రెండు రోజుల నుండి ముగ్గళ్ళ, రఘుదేవపురం, వంగాలపూడి, రాపాక, కూనవరం, రామచంద్రపురం, వెద్దుళ్లపల్లి, ఇనుగంటివారిపేట 20.25, చినకొండేపూడి 40, కాటవరం 10.125, గ్రోమోర్ 20.25, మునికూడలి 12.5 మెట్రిక్ టన్నుల యురియా నిల్వలు రావడం జరిగింది అని అన్నారు. వీటిని రైతులు తమ ఆధార్, పాస్ బుక్ జిరాక్స్ కాపీలను చూపించి తీసుకోని వెళ్ళవచ్చు అని అన్నారు. కావున రైతులు ఎవ్వరూ యురియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. యురియా పక్కదారి పట్టకుండా పై అధికారులు ఆదేశాల మేరకు రైతులకు అమ్మకాలు జరపడం జరుగుతుంది అని అన్నారు.

## ఎరువుల బ్లాక్ మార్కెట్ నివారించాలి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఎరువులు బ్లాక్ మార్కెట్ని నివారించాలని మండల వైసిపి అధ్యక్షుడు తెలిపారు. సోమవారం కొత్తపల్లిలో అన్నదాత పోరు, రైతన్నకు బాసటగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోస్టల్ ఆవిష్కరం చారు. మంగళవారం కాకినాడ డివిజన్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మానికి వైసీపీ నాయకులతో పాటు రైతన్నలు కూడా హాజరు కావాలని పిలుపునిచ్చారు. పిఠాపురం వైసిపి ఇన్చార్జ్ వంగా గీత కాకినాడ స్వగృహం నుండి ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

## ప్రజ్ఞా పురస్కార్ అవార్డు ప్రదానం

విశాలాంధ్ర - అమలాపురం : ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ డా అంబేద్కర్ కోనసీమ జిల్లా సౌజన్యంతో 'మధు పౌర్ణమి పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయు' త్రిరత్న బుద్ధ విహార్ వేదికగా, సీనియర్ ధమ్మ బోధ కులు, రామ్ బోధికాశి అధ్యక్షతన రాష్ట్ర అధ్యక్షులు నేషనల్ ట్రస్టీ వై హరిబాబు రాష్ట్ర ఉపాధ్యక్షుల డిబిలోక్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఉపాధ్యాయ ప్రజ్ఞా పుర స్కార్ అవార్డుకు ఎంపిక చేసిన వారికి, బిఎస్ఐ మెమెంటో, శాలువ, సర్టిఫికెట్తో ఘన సత్కారం పొందారు. ఆయుష్మాన్, రాంబోధి కాశి, ఆయుష్మతి ప్రజ్ఞా శ్రీనివాస్, నక్కా శ్రీనివాసు, పెట్టా వెంకటరావు, కాశి వెంకటరావు, నేరేడిమిల్లి సత్యనారాయణ, డా ఉప్పే సత్యనారాయణ, ఎంఎ కె భీమ్ రావ్, నేలపూడి మసేనురావు, విప్పర్తి ప్రభాకర్ రావు, విప్పర్తి భానోజీరావు, కడిమి వివిస్ దుర్గారావు, సివి రామన్ విద్యా సంస్థల అధినేత రవణం వేణు, జిల్లా ఉపాధ్యక్షులు కోలా త్రిమూ ర్తులును ఘనంగా సత్కరించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో కురాటి విశ్వనాథం, కోడూరు రామ్మూర్తి, మగ్గి సత్యమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి ములపర్తి సత్యనా రాయణ, వందన సమార్పణ తోముగిసింది.

# ప్రజా చైతన్యానికి కళలు పునాది : తాటిపాక

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్: గరికిపాటి రాజారావు 62వ వర్ధంతిరాజమండ్రి తుమ్మలావ రామచంద్రరావు పేటలో ఉన్న రాజారావు విగ్రహం వద్ద జరిగింది. ముందుగా రాజారావువిగ్రహానికి సీనియర్ కళాకారులు బొడ్డు బుల్లబ్బాయి , తాటిపాక మధు, కుంద్రపు రాంబాబు, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు మహంతి లక్ష్మణరావు పూలమాలలతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు బొడ్డు బుల్లబ్బాయి మాట్లాడుతూ డాక్టర్ గరికిపాటి రాజారావు ఆధ్వర్యంలో మాభూమి నాటకం వందల దళాలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించిందని ప్రజలను ఎంతగానో చైతన్యపరిచిందని ఆ క్రమంలో ప్రభుత్వం ప్రజానాట్యమండలి నిషేధించిందని ప్రజా కళలు ప్రజల్ని ఎంతగా చైతన్య పరుస్తాయో ఈ సంఘటన ద్వారా అర్థమవుతుందన్నారు. ప్రజా చైతన్యానికి కలలు పునాది కావాలి అని అన్నారు సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాకం మధు మాట్లాడుతూ తెలంగాణ రైతంగ పోరాటంలో స్వతంత్ర ఉద్యమంలో ప్రజా కళాకారుల పాత్రని మరువలేమని ప్రస్తుత సామ్రాజ్యవాద విషయ సంస్కృతిని వ్యతిరేకంగా కళారూపాలు తయారవ్వాలని అన్నారు. మహంతి లక్ష్మణరావు మాట్లాడుతూ రాజారావు మట్టిలో మాణిక్యాలని వెలికి తీసిన వారిలో అల్లు రామలింగయ్య, జమున, కాకరాల,వల్లం నరసింహారావు, అనేక మందిని సినీ రంగానికి పరిచయం చేశారని గుర్తు చేశారు. ప్రజానాట్యం మండలి రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలలో భాగస్వామ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోరిపాటి తాతారావు, జామిశెట్టి అప్పాజీ, మహిళా సమాఖ్య నాకురాలు సేపీని రమణమ్మ, సీనియర్ నటి భైరవ ఉమామహేశ్వరి, సీపీఐ నగర సహాయ కార్యదర్శి పి లావణ్య, ఏ ఐ వై ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి త్రిమూర్తులు రామరాజు , ప్రజానాట్య మండలి నగర కార్యదర్శి ఎస్ నౌరోజీ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులు స్వీయ నియంత్రణ పాటించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: పొగాకు రైతులు స్వీయ నియంత్రణ పాటించి ఎన్ఎల్ఎస్ పొగాకును కాపాడుకోవాలని పొగాకు బోర్డు చైర్మన్ సిహెచ్ యశ్వంత్ కుమార్ పేర్కొన్నారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఆయన పొగాకు బోర్డు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంవత్సరం పొగాకు పంట ప్రారంభంలో కొంత నిరాశపరిచిన జూలై 15 నుంచి పొగాకు రేటు క్రమంగా పెరిగిందన్నారు.ఎన్ ఎల్ ఎస్ ఏరియాలో 42 మిలియన్ కిలోలు అనుమతి ఇవ్వగా అదనంగా 12 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయిందని అన్నారు ఎన్ ఎల్ ఎస్ ఏరియా లో 5 వేలం కేంద్రాలలో పొగాకు వేలం ప్రక్రియ కొనసాగుతోందని ప్రస్తుతం కిలో 350 నుండి 370 రూపాయల వరకు ధర పలుకుతోందని తెలిపారు. వచ్చే సంవత్సరం పొగాకు పంట నియంత్రించవలసిన అవసరం ఉందన్నారు. ఇప్పటినుండే రైతులు నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అంతర్జాతీయంగా భారతదేశంలో పండించే పొగాకుకు పోటీ ఉందని ముఖ్యంగా జింబాబ్వే బ్రెజిల్ దేశాలు పోటీపడుతున్నాయని జింబాబ్వేలో ఈ సంవత్సరం 35 మిలియన్ కిలోలు బ్రెజిల్ దేశంలో కూడా పొగాకు ఎక్కువగా ఉత్పత్తి అయిందన్నారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో 11.5 మిలియన్ కిలోలు పొగాకు అనుమతి ఇవ్వగా 11.8 మిలియన్ ఉత్పత్తి అయిందని తెలిపారు. ఇప్పటివరకు దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో 10 మిలియన్ కిలోలు పొగాకు అమ్మకం జరిగిందని మరో 2 మిలియన్ కిలోలు పొగాకు అమ్మకం జరగవలసి ఉందని అక్టోబర్ నెల ఆఖరి వరకు అమ్ముకోవాలని సూచించారు. అనంతరం పొగాకు బోర్డ్ చైర్మన్ యశ్వంత్ కుమార్ ను దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం రైతులు సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం నేతలు కరుటూరి శ్రీనివాస్ కాట్రు సత్యనారాయణ దుద్దుపూడి హరిబాబు యాగంటి వెంకటేశ్వరరావు సింహాద్రి ధర్మవతారం నరహరిశెట్టి రాజేంద్ర బాబు కాట్రు సత్యనారాయణ పరిమి శ్రీ రామకృష్ణ దేవరపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ యద్దనపూడి రవీంద్ర సత్తి జగదీశ్వర్ రెడ్డి బిక్కిన నాగరాజు నాయుడు దుర్గాప్రసాద్ రైతు నాయకులు పాల్గొన్నారు

## వైద్య ఖర్చులతో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోకూడదు : మంత్రి

విశాలాంధ్ర - నిడదవోలు : వైద్యఖర్చులతో ఏ కుటుంబం ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధిని అందచేసి రోగి కుటుంబాన్ని ఆదుకుంటుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రూ. 40,01,784ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కందుల దుర్గేష్ లబ్దిదారులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద రోగుల పాలిట సంజీవని వంటిదన్నారు. వైద్యం అందక ఏ రోగి ప్రాణాపాయస్థితిలో ఉండకూడని, వైద్యానికి అయ్యే ఖర్చులతో రోగి కుటుంబం ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో సీఎంఆర్ఎఫ్ నిధిని అందజేస్తున్నామన్నారు.నిడదవోలు నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న 47మంది బాధితులకు రూ.29,01,784 లను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి కందుల దుర్గేష్ అందజేశారు. మరో ముగ్గురికి11 లక్షల విలువైన ఎల్ వో సీలను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణపై అవగాహన : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒకటే మార్గమని ఈ వ్యాధి నివారణపై పాడి రైతులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధకటీకాల కార్యక్రమంపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. 15 నుంచి అక్టోబర్ 15 వరకు జరుగనున్న ఈ కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక జేడీ డా కె కృష్ణమూర్తి, డీడీ డా డీబీఆర్ అంబేద్కర్, ఏడీ డా ఎం దినకర్, డా గిరీష్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వీజీ ఆర్ఎస్ సమావేశ మందిరంలో 59వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సంపూర్ణ అక్షరాస్యత ప్రతిజ్ఞ చేయించారు. నేను నా చుట్టూ ఉన్న అందరూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయుటకు స్వచ్ఛందంగా కృషి చేస్తానని, వారి జీవన నైపుణ్యాలను పెంపొందించడానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రతిజ్ఞ చేయుచున్నానని జిల్లా అధికారులు, ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి పోషయ్య కార్యక్రమను ఉద్దేశించి మాట్లాడుతూ అక్షరాస్యత ఆవశ్యకత, చదువుకున్న వారికి సమాజంలో జీవన ప్రమాణాలు ఎలా మెరుగు పడతాయో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకట్రావు, మెప్మా పీడీ ప్రియం వద, డిసిహెచ్ఎస్ లావణ్య కుమారి, గ్రహనిర్మాణ శాఖ పిడి ఎన్వివి సత్యనారాయణ, పిఓ ఎస్ఎస్ఏ వేణుగోపాల్, సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడి శ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో నానో యూరియా



విశాలాంధ్ర - కరప : రైతులకు యూరియా కొరత లేదని నానో యూరియా లిక్విడ్ అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారిని సత్య పేర్కొన్నారు. వేములవాడ గ్రామంలో సొసైటీ నందు రైతులకు అమ్ముతున్న యూరియా స్టాక్ను పరిశీలించడం జరిగింది. సొసైటీ అధ్యక్షులు దూడల నారాయుడు రైతులు పాల్గొన్నారు. నానో యూరియాని 15 రోజులు నిండిన వరి పైరుపై పిచికారి చేసినట్లయితే చేను ఎత్తుగా ఏపుగా పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. మొదట దశ రైతులు ఎరువులు వేసుకోవడం పూర్తయిందని రెండో దశలో అధిక మోతాదులో ఎరువులు వాడకం మంచిది కాదని వ్యవసాయ అధికారిని సత్య తెలిపారు.

# ఎమ్మెల్యేకి జనసైనికుల సెగ

విశాలాంధ్ర - తాళ్లపూడి : పెద్దెవంలో ఆగిపోయిన డ్రెన్ నిర్మాణానికి నిధులిచ్చిన ఎంపీపీని, గ్రామ సర్పంచ్ని, ఇద్దరూ లేకుండా డ్రెన్ పనులుకు కొబ్బరికాయ కొట్టిన పెద్దెవంలో డ్రెన్ సమస్య నాకెందుకు చెబుతున్నారు? ప్రోటోకాల్ పాటించాలన్న విషయం అధికారులకు, నాయకులకుపట్టదా? అని ఎమ్మెల్యే జనసైనికులపై ఆగ్రహాన్ని ప్రదర్శించారు. తాళ్లపూడి మండలం పెద్దెవం గ్రామంలోని ఈ డ్రెన్ వివాదం ఎన్డీయే కూటమిలోని జనసైనికులు కారణంగా కొవ్వూరు ఎమ్మెల్యేకి తలనొప్పిగా మారింది. అసంపూర్తిగా మిగిలిన డ్రెన్ నిర్మాణం కారణంగా ఇబ్బందులు పడుతున్నామన్న జనసేన అభిమాన కుటుంబాల విన్నపం మేరకు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పంచాయతీ, మండల పరిషత్లలో నిధులు లేమి ఉన్నప్పటికీ సర్దుబాటు చేసే విధంగా మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేశారు. గతంలో ఎంపీ వచ్చిన సమయంలో ఘటన పెద్ద ఇష్యూగా నడిచింది. ఎమ్మెల్యే చొరవతో నిధులు కేటాయించగా, పెద్దెవం గ్రామ (వైకాపా వర్గం) సర్పంచ్, ఉపసర్పంచ్లు పంచాయతీలో తీర్మానం చేసారు. అనంతరం ఎంపీపీగాని సర్పంచ్గాని లేకుండానే కొబ్బరికాయ కొట్టేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. ఈ విషయాన్ని సోమవారం పెద్దెవం వచ్చిన ఎమ్మెల్యే వద్ద జనసేన నాయకులు ప్రస్తావించగా, ఆయన ఒక్క సారిగా సీరియస్ అయ్యారు. పెద్దెవం గ్రామానికి ఎమ్మెల్యే వస్తున్న విషయం ఆ ప్రాంత ఎంపిటిసి వీర హరిబాబు తనకు తెలియదని ఎమ్మెల్యే ఎదుట ప్రోటోకాల్ పాటించటం లేదని బయటపడ్డారు. కొవ్వూరు ఎమ్మెల్యేగా వచ్చినప్పటి నుంచి ఎన్డీఏ కూటమి నాయకులు కోసం ఆరా తీయని రోజు లేదని చెప్పి ఎమ్మెల్యే జనసైనికులను సర్దుబాటు చేసారు. ఒకే పంచాయతీ అయినప్పటికీ, ఇక్కడ జనసేన పెద్దెవం, రావూరుపాడు గ్రామాల్లో నాయకత్వాలకు తోడు జనసేన అభిమాన వర్గం కూడా ఉంది. మొత్తానికి డ్రెన్ పనులు మంజూరు అయితే అయ్యాయి కానీ పనులు కొనసాగే పరిస్థితి కానరావడం లేదు.

# ఫిర్యాదులు పారదర్శకతతో పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందిన అర్జీలను పారదర్శకతతో, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసు, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల రావు తదితర అధికారులు హాజరై, కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం-480 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సరఫరాపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర - మామిడికుదురు : రైతులకు అవసరమైన యూరియా దిగుమతి అవుతోందని మండల ప్రత్యేకాధికారి మధుసూధన్, ఏఓ ఎన్వీవీ సత్యనారాయణ తెలిపారు. ఆదుర్రు, కొమరాడ గ్రామాల్లో సోమవారం రైతులతో యూరియా సరఫరాపై అవగాహన సదస్సు నిర్వహించారు. సొసైటీలు, ప్రైవేటు డీలర్లకు 50 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందన్నారు. రెండు రోజుల్లో మరికొంత యూరియా దిగుమతి అవుతుందన్నారు. సమావేశాల్లో సర్పంచులు బళ్ల శ్రీనివాస్, వలవల సత్యవేణి, డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, ఆర్ఐ ఇబ్రహీమ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

## పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ ప్రాధాన్యతపై వర్క్‌షాపు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు చెన్నై ఎల్ అండ్ టి ఎడ్యుటెక్‌కు చెందిన డా మహేష్ కులకర్ణి 'పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ ఆన్ ఇండస్ట్రియల్ కాంటెక్స్ట్' అనే అంశంపై ఆఫ్‌లైన్ సెషన్ నిర్వహించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. డా మహేష్ కులకర్ణి పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ ప్రాధాన్యతను, పరిశ్రమల్లో దీని అన్వయాన్ని వివరించారు. ఆధునిక విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థలో ఉపయోగించే సాంకేతికతలను, విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. పరిశ్రమలలో పవర్ ప్లాంట్‌ల రూపకల్పన, నిర్వహణ, సామర్థ్యం మెరుగుదల వంటి అంశాలను విశ్లేషించారు. ఈ సందర్భంగా మెకానికల్ విభాగాధిపతి డా ఎస్‌డివివిఎస్ భీమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సెషన్ విద్యార్థుల భవిష్యత్తు పరిశ్రమల్లో అవకాశాలను విస్తృతం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిమ్మకాయల మృతికి కార్మికుల సంతాపం

విశాలాంధ్ర - అమలాపురం : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిపిఐ కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల శ్రీనివాసరావు అకాల మరణానికి చింతిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఏఐటియుసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కే సత్తిబాబు తనకు పసంగు శిష్యుడైన నిమ్మకాయల శ్రీనివాసరావు అనారోగ్యంతో మరణించడం తనను కలచి వేసిందని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జివి రమణ, మండల కార్యదర్శులు కామ్రేడ్ కాళ్ల భీమరాజు, నాగరాజు, కురస నాగేశ్వరావు, రైతు సంఘం నాయకులు మట్టపర్తి సత్యప్రసాద్, డిహెచ్‌పిఎస్ నాయకులు మోకా శ్రీనివాసరావు, కామ్రేడ్ చంద్రరావు, రొక్కాల సత్యనారాయణ, పలువురు కార్మిక నాయకులు, నిమ్మకాయల శ్రీనివాసు నివాళులర్పించారు.

## రాజకీయ మనుగడకు వైసీపీ పాట్లు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రావులపాలెం : వైసీపీ నాయకులు తమ రాజకీయ మనుగడకు అన్నదాత పోరు అంటూ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాటు రైతుల కోసం ఏ మాత్రం ఆలోచించకుండా పాలన చేసిన జగన్ ఇప్పుడు అన్నదాత పోరు అంటూ మొసలి కన్నీరు కార్చడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. రైతుల దెబ్బకే వైసిపి గత ఎన్నికల్లో 11సీట్లకు పరిమితం అయ్యిందని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20వేలు రైతులకు అందిస్తుందన్నారు. ఏ పంట కైనా ధరలు లేకపోతే వెంటనే ప్రభుత్వం రంగంలోకి దిగి ధరల స్థిరీకరణ చేసి రైతుల్ని ఆదుకుంటుందన్నారు. మీ హయాంలో కనీసం ఒక్క రైతు కన్నా ఒక తార్పాలిన్ అయినా ఇచ్చారా? ఒక డ్రిప్ ఇరిగేషన్ పథకం అయినా ఇచ్చారా? అని వైసీపీ నాయకులను ఆయన ప్రశ్నించారు. 3200 బస్తాలు, సుమారు 144 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందన్నారు. వానపల్లి, నర్సిపూడి సొసైటీలకు మరింత యూరియా రాబోతుందని చెప్పారు. నిరంతర సరఫరా జరగనుందన్నారు. వైసీపీ నాయకులు జిమ్మిక్కులతో ప్రజల్లోకి వెళ్లాలని చూస్తే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి దాపురిస్తుందని ఎద్దేవా చేశారు. రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ ఆదేశించారు. సోమవారం ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ఆరుగురు పౌరులు ఫోన్ ద్వారా తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్, పెన్షన్, వంటి విభాగాలకు సంబంధించిన 21 పైగా సమస్యలు కూడిన అర్జీలను ప్రజలు కమిషనర్ భావనకు అందజేశారు. వాటిపై సంబంధిత శాఖాధికారులను వెంటనే స్పందించాలని కమిషనర్ సూచించారు. "ప్రజా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలి" అని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి వెంకట్రావు, ఎంహెచ్ఓ డా పృథ్వీచరణ్, మేనేజర్ సీతారాం, టిపిఆర్ఓ శైలజ, అకౌంటెంట్ రామశాస్త్రి, ఉద్యానవన శాఖ ఏడి సీరిల్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోలకు శిక్షణ ప్రారంభం

విశాలాంధ్ర - సామర్లకోట : ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన వారికి సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో నెల పాటు ప్రాథమిక శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రెండో బ్యాచ్‌గా 42 మంది ఎంపీడీవోలు ఈ శిక్షణకు హాజరయ్యారు. తొలి రోజు శిక్షణకు ముందు ఎంపీడీవోల పరిచయ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. నెల రోజుల ఈ శిక్షణతో పరిపాలన నైపుణ్యాలు మరింత పెంచుకోవాలని శిక్షణ కేంద్రం ఉప ప్రిన్సిపల్ జి రమణ పిలుపునిచ్చారు. శిక్షణకు ముందు, తర్వాత శిక్షణార్థులలో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆయన అన్నారు. ప్లాస్టిక్ రహిత ఈటీసిలో భాగంగా శిక్షణార్థులకు స్టీల్ మంచినీటి సీసాలను అందజేశారు. అదేవిధంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై వివిధ జిల్లాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు 55 మందికి టిఓటిలుగా శిక్షణ ప్రారంభమైంది. మూడో బ్యాచ్‌గా వీరికి ఈనెల 10 వరకు మూడు రోజులపాటు ఈ తరగతులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌ల ద్వారా 165 మంది ఈటిఓటి శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో డిడిపోలు శ్రీనివాస్ శర్మ, ఫ్యాకాలిటీ సుశీల, శేషుబాబు, చక్రపాణి రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర - మండపేట : మండపేట మండలం తాపేశ్వరం, అర్తమూరు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో రైతులకు యూరియా ఎరువుల వినియోగం, అందుబాటుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అవసరమైన ఎరువుల సరఫరా వివరాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు వ్యాపారస్తుల ద్వారా ఇప్పటివరకు పంపిణీ చేసిన ఎరువులపై రైతులకు వివరించారు. తాపేశ్వరం పిఏసిఎస్‌లో ప్రస్తుతం 9 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రాబోయే వారం మరో 10 టన్నులు చేరనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు గ్రామాలకు 145 టన్నుల అవసరం కాగా ఇప్పటివరకు 134 టన్నులు సరఫరా చేసినట్టు తెలిపారు. రైతులు ఎరువుల కొరతపై ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. నానో యూరియా వినియోగం పై ఆయన ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి (పశుసంవర్ధక శాఖ) ఏడిపి రామకృష్ణ మాట్లాడుతూ రైతులకు అవసరమైనంత యూరియా ఎరువులు ఎల్లప్పుడూ సరఫరా చేస్తామని తెలిపారు. మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ నల్లమిల్లి రెడ్డి, గ్రామ నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, నిన్నే వీరభద్రరావు, వాసంశెట్టి గోవింద్, నన్నే వీర్రాజు, పిఏసిఎస్ పడాల రామకృష్ణ రెడ్డి, నల్లమిల్లి వీర్ రెడ్డి, పడాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియా పంపిణీ

విశాలాంధ్ర - పెదపూడి : మండలంలో యూరియా కొరత లేదని పుష్కలంగా రైతులకు యూరియా అందజేయడం జరుగుతుందని తహసీల్దార్ సీతాపతిరావు, మండల వ్యవసాయ అధికారి సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం పెదపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులకు నానో యూరియా పంపిణీ చేశారు. నానో యూరియా కలిగే ప్రయోజనం, వాడక విధానాన్ని ఇఫ్‌కో కోడ్ కాకినాడ విభాగం చైర్ పర్సన్ శ్యాంప్రసాద్ వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మొక్కలకు అవసరమైన మేరకే రసాయన ఎరువులు వాడాలని, ప్రకృతి సేద్యం వైపు కూడా రైతులు మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్, నీటి సంఘం అధ్యక్షులు ఆరుమిల్లి వాసు, ఉప సర్పంచ్ సత్తి బాబు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని బాధితులకు సాయం

విశాలాంధ్ర - రావులపాలెం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలో కొడమంచిలి శేఖర్ అత్తయ్య కొల్లి సత్యవతి ఇల్లు నిన్న అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఘటన తెలిసిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి బాధితులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి మానవతా దృక్పథంతో సహాయం చేస్తూ 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు మరియు రూ.5000 నగదు అందజేశారు. చిర్ల జగ్గిరెడ్డి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పుతూ, పార్టీ తరఫున ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముద్రగడను కలిసిన రఘురాం

విశాలాంధ్ర - జగ్గంపేట : మాజీమంత్రి వైసీపీ పీఏసీ నాయకులు ముద్రగడ పద్మనాభం నివాసంలో వైసిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం మాజీమంత్రి ముద్రగడ పద్మనాభంని, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కో -ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఒమ్మి రఘురాం మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకుడిగా పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించారని వైసీపీకి ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ఏలూరు, ధర్మవరం ఎరువులు షాపులపై సోమవారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ధర్మవరం ఎరువుల షాపులో స్టాకులో వ్యత్యాసం ఉండటంతో 3 లక్షల రూపాయల విలువ చేసే ఎరువులని అమ్మకాలని నిలుపుదల చేయమని ఆదేశాలు ఇవ్వడంతో ఏలూరులో శ్రీ విఘ్నేశ్వర ఎరువుల షాపులో రూ.8.15 లక్షల ఎరువుల ఈపాస్ మిషన్లో ఎరువుల వ్యత్యాసం కలిగి ఉండడంతో 6ఏ కేసును నమోదు చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి జోకా అమృత తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఐ గోపాలకృష్ణ, కె విజయ్ కుమార్, విజిలెన్స్ తహసీల్దార్ జీవీఎస్ లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు కొరతపై సీపీఐ నిరసన

- యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం
- వ్యవసాయ శాఖ మంత్రిని కంటి ఆసుపత్రి చేర్పించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర- రాజమండ్రి : రైతులకు యూరియాను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, బ్లాక్ మార్కెట్ ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని, బ్లాక్ మార్కెట్ ఆపాలని, రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, సీపీఐ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ రైతాంగానికి సకాలంలో ఎరువులు అందించకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యా రన్నారు. అధికారంలోకి రాకముందు రైతే రాజు, రైతు లేనిదే రాజ్యం లేదని గొప్ప గొప్ప ప్రగల్భాలు పలికారని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు తుంగలో తొక్కరన్నారు. ప్రభుత్వ విధానాలతో రైతులు ప్రతి యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి కోలుకోలేని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలపై దృష్టి సారించి రైతు డిమాండ్లను తక్షణమే పరిష్కారం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెయ్య నాయుడు యూరియా కొరత లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. యూరియా కొరత తీవ్రంగా ఉందని తూర్పు గోదావరిలో యూరియా లేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని మంత్రిని కంటి ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన యూరియా కూటమి నాయకుల గోడౌన్లకు తరలుతుందని మధు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు, స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను తక్షణం రద్దు చేయాలన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు విడుదల చేయాలన్నారు. ప్రతి రైతుకు రూ. 20వేలు సాగుసాయం తక్షణం విడుదల చేయాలన్నారు. రైతు రుణ విమోచన చట్టం తెచ్చి, రైతుల రుణాలన్నింటిని ఒకే పర్యాయం మాఫీ చేయాలని, పాడి రైతులకు మద్దతు ధర కల్పించాలన్నారు. కౌలు రైతుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తెచ్చి,2013 భూ సేకరణ చట్టంలో రైతు వ్యతిరేక అంశాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీమా రుసుం ప్రభుత్వాలే భరించి,50 సంవత్సరాలు నిండిన రైతులకు రూ. 10 వేలు పెన్షన్ మంజూరు చెయ్యాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రైతులతో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షులు కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి కొండలరావు సహాయ కార్యదర్శి పి లావణ్య, పార్టీ నగర కార్య వర్గ సభ్యులు ఎస్ నౌరోజీ, టీ నాగేశ్వరావు, పి త్రిమూర్తులు, కొండవతి, రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వరావు, జట్ల సంఘం అధికార బడి నల్ల రామారావు, పి దేముడు బాబు, కళ్ల అప్పల నాయుడు, వెంకట్రావు, బాలకృష్ణ, మునిసిపల్ నాయకులు దుర్గమ్మ, శారద, పోలమ్మ, గిరి శ్రీను, ప్రజానాట్య మండలి నాయకులు ఉమా, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి నాగేశ్వరావు. రెడ్డి రమకృష్ణ పాల్గొన్నారు.

### దళారీ వ్యవస్థ అరికట్టాలి

విశాలాంధ్ర - సామర్లకోట : రైతులకు ఎరువుల కొరతను తీర్చాలని, దోపిడీ దళారుల వ్యవస్థను అరికట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సామర్లకోటలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కార్యాలయం వద్ద సామర్లకోట సీపీఐ పట్టణ కార్యదర్శి పెద్ది రెడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ నిరసనకు ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సుమారు రెండు నెలలుగా యూరియా కొరత ఉందని ఆ కొరతను తీర్చడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అందేదని కానీ కొన్నిచోట్ల రైతు భరోసా కేంద్రాలు మూసివేసే పరిస్థితి ప్రభుత్వం తీసుకు వచ్చిందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా, సొసైటీల ద్వారా, పిండి కొట్టుల ద్వారా యూరియా సరఫరా చేయడం జరుగుతుందని, యూరియా బస్తాలు రాజకీయంగా దళారులకు, భూస్వాములకు మాత్రమే అధిక స్థాయిలో యూరియా బస్తాలను అందిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో సామర్లకోట, పెద్దాపురం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ తదితర ప్రాంతాల్లో అధికంగా యూరియా కొరత ఉందని, గతంలో యూరియా తీసుకునేందుకు నేరుగా రైతులు వెళ్లేవారని, ప్రస్తుతం టోకెన్లు రాత్రి సమయంలో కొంతమందికి పంపిణీ చేస్తే గంటల తరబడి టోకెన్లు తీసుకున్న తర్వాత కొంతమందికి మాత్రమే యూరియా అందుతుందని మిగతా వారికి లేదని స్టాక్ వచ్చిన తర్వాత ఫోన్ చేస్తామని సొసైటీలు వారు చెప్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి రైతులందరికీ యూరియా బస్తా సక్రమంగా అందేటట్లు చూడాలన్నారు. ఈ నిరసన అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ భవాని, పెద్దిరెడ్ల అర్జున్ రావు, మడగల రమణ, బర్ల లక్ష్మీనారాయణ, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

## యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు : సాకా

విశాలాంధ్ర - పిఠాపురం : రైతులకు యూరియా ఎంత కావాలంటే అంత లభిస్తోందని అధికార పక్షం నేతలు రకరకాల ప్రచారం చేస్తున్నా యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారన్న వాస్తవాన్ని మాత్రం దాచలేరని సీపీఐ పిఠాపురం కార్యదర్శి సాకా రామకృష్ణ, పిఠాపురం మహారాజా రైల్వే వారధి పరిసరప్రాంత అభివృద్ధి కమిటీ నాయకుడు యనమండ్ర సూర్యనారాయణ మండిపడ్డారు. పిఠాపురం పట్టణంలోని మున్సిపల్ గెస్ట్ హౌస్లో ఉన్న పాడా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో రైతులకు యూరియా కొరత లేకుండా అందించి ఆదుకోవాలని పలువురు రైతులతో కలిసి వారు పాడా ఏపీడీ వసంతమాధవికి వినతిపత్రం అందించారు.

## ఆక్వా పన్నులు తగ్గించాలి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఆక్వా రైతులపై అమెరికా అధ్యక్షుడు విధించిన 50 శాతం పన్ను తగ్గించాలని సోమవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురాల అప్పారెడ్డి, రైతు సంఘం నాయకులు జి వెంకటసుబ్బారెడ్డి రొయ్యల చెరువుల రైతులను కలిసి కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం విజయవాడలో జరుగు రొయ్యల రైతుల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సదస్సులో చర్చించి అనంతరం వ్యవసాయ శాఖ మంత్రికి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని, జిల్లాలోని ఆక్వారైతులందరూ పాల్గొని సదస్సులు జయప్రదం చేయాలని కోరారు. కాకినాడ జిల్లాలో సుమారు లక్ష 50 వేల ఎకరాల్లో ఆక్వా చేపల రైతులు సాగు చేస్తున్నారని, అదేవిధంగా జిల్లాలో తీర ప్రాంతంలో విపరీతమైన రొయ్యల యాచరీలు మరియు రొయ్యల పరిశ్రమలు ఉన్నాయని వీటి మీద ఆధారపడి వేల మంది కార్మికులు, రైతులు, మహిళలు జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ సమస్యలన్నింటిపై విజయవాడలో జరిగే సదస్సులో చర్చిస్తారని కావున రైతులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారన్నారు

## మద్దూరులో బస్ సర్వీస్ ప్రారంభం

విశాలాంధ్ర - కొవ్వూరు : ఎట్టకేలకు మద్దూరు గ్రామానికి పల్లె వెలుగు బస్సు రావడంతో ఆ గ్రామమంతా మా గ్రామానికి వెలుగొచ్చిందంటూ బస్సు వద్దకు వచ్చారు మావిడాకులు కట్టి బస్సుకు హారతులు ఇచ్చారు. కొవ్వూరు మండలం మద్దూరు గ్రామంలో APSRTC నిడదవోలు డిపో బస్ సర్వీస్ ను కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ గత కోవిడ్ నుండి బస్ సర్వీస్ లేక విద్యార్థులు, మహిళలు, వృద్ధులు చాలా ఇబ్బందులకు గురయ్యేవారని మద్దూరు కూటమి నాయకులు ఈ విషయాన్ని శుక్రవారం నాడు గ్రీవెన్స్ లో నాదృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చొరవతో మళ్ళీ ఈ బస్ సర్వీస్ పునః ప్రారంభం చేస్తున్నారని. ఈ బస్ ఉదయం 8 మద్దూరు వస్తుందని... రూట్ నిడదవోలు నుండి సమిశ్రగూడెం, గోపవరం, విజ్జేశ్వరం మద్దూరు, బంగారమ్మపేట వాడపల్లి, ఔరంగాబాద్, టోల్గేట్ కొవ్వూరు మీదుగా రాజమహేంద్రవరానికి 4 ట్రిప్పులు షటిల్ సర్వీస్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నిమ్మకాయల ఆకస్మిక మృతి

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నిమ్మకాయల శ్రీనివాసరావు అనారోగ్యంతో సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరం. ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి, కార్మికవర్గానికి తీరనిలోటని సీపీఐ జిల్లాకార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇటీవల ఒంగోలులో జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభలలో ప్రతినిధిగా మూడు రోజులపాటు పాల్గొన్నారు. కమ్యూ నిస్టు పార్టీ నిర్వహించిన అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై నిరంతరం పోరాడుతు న్నారు. ఆయన మృతిపట్ల సీపీఐ జిల్లా సమితి తరపున కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ సంతాపం తెలిపారు. అమలాపురం మున్సిపల్ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శిగా సేవలంది స్తున్న నిమ్మకాయల శ్రీనివాస్ మున్సిపల్ కార్మికులు జీర్ణించుకలేకపోతున్నారు. నిత్యం తమతో కలిసి మెలిసి ఉంటూ కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాడే నిమ్మకాయల శ్రీనివాస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మరణించడంతో కార్మికులోకం కన్నీరు మున్నేరు అవుతుంది. ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండి పరిష్కరించి నిమ్మకాయల శ్రీనివాస్ ఇక లేరు అన్న బాధను కార్మికులు భరించలేరన్నారు. నిమ్మకాయల శ్రీనివాస్ భౌతిక కాయాన్ని కార్మికుల కన్నీటి రోదనల మధ్య కాకినాడ ఆసుపత్రి నుంచి అమలాపురానికి తరలిస్తున్నారు. మంగళవారం ఉదయం నిమ్మకాయల శ్రీనివాస్ అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిసింది.

## పోలీసు కుటుంబాలను ఆదుకుంటాం : ఎస్పీ

విశాలాంధ్ర- ఏలూరు : విధి నిర్వహణలో అశువులు బాసిన అమరవీరుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఏలూరు జిల్లా ఎస్పీ కే. ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. పోలీస్ శాఖలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పెద్ది రాజు అనారోగ్య కారణాల వల్ల మృతి చెందగా కారుణ్య నియామకం కింద పెద్దిరాజు కుమారుడు పి.నవీన్ కుమార్ కి సోమవారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగ నియామక ఉత్తర్వులను ఎస్పీ కిషోర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విభాగంలో విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన అమరుల కుటుంబాలను ప్రోత్సహించడం, ఆదుకోవడం తమ ప్రధాన బాధ్యత అన్నారు. అటువంటి కుటుంబాలకు తోడుగా నిలబడేందుకు ప్రభుత్వం చేపట్టిన కారుణ్య నియామక విధానానికి అనుగుణంగా ఈ నియామకం చేపట్టడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాం అని ఎస్పీ పేర్కొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర రాజకీయాల్లో మలుపు : చింతామోహన్

విశాలాంధ్ర - కాకినాడ : కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఎస్సీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన, రాజ్యాంగ పరిరక్షణ మహాపాదయాత్ర సోమవారం సాయంత్రం కాకినాడ పట్టణానికి చేరుకుంది. ఇంద్రపాలెం అంబేద్కర్ సర్కిల్ వద్ద స్థానిక ఎస్సీ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్ర భానుగుడి సెంటర్ వరకు కొనసాగింది. పాదయాత్రకు ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ప్రసంగించారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర దేశ రాష్ట్ర రాజకీయాల్లో గొప్ప మలుపులు తీసుకొస్తుందని పేర్కొన్నారు. దళితులను విభజించు పాలించు అన్న ఆలోచన మంచిది కాదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణ పొరపాటు నిర్ణయం అని. దళితుల కెమిస్ట్రీ గురించి పూర్తి అవగాహన లేకుండా సీఎం చంద్రబాబునాయుడు వర్గీకరణ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తెలిసో తెలియకో తప్పిదం చేశారని, తప్పిదాన్ని సరిదిద్దుకోవాలన్నారు. రెండు రోజుల వ్యవధిలో ఎస్సీ వర్గీకరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. ఎస్సీ విద్యార్థులకు స్కాలర్షిప్పు అందడం లేదని, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్లు నిధులు లేక, ఖాళీ కుర్చీలతో కార్యాలయాలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. ఏపీలో 20 శాతం ఉన్న దళితులకు, ఏం మిగిలిందని, ఏం సాధించారు? కాకినాడ జిల్లాలో ఒక్క కోటీశ్వరుడన్న ఎస్సీల్లో ఉన్నారా? అని ప్రశ్నించారు. ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్, ఆర్పిఐ రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, ఎస్సీ సంఘాల నాయకులు శివ ప్రసాద్, మేఘరాజు, సతీష్ కుమార్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు